ప్రజాశక్తి
గురువారం 16 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

విజయవాడలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర

- ఎంసి చైర్‌పర్సన్ అనంతకుమారి
- ఎంసిలో కేంద్రం ... జిన్నింగ్ మిల్లుల్లో విక్రయాలు
- కాటన్ కార్పొరేషన్ తీరుపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల పంటలకు మద్దతు లభిస్తుందని, కావున వీటిని వినియోగించుకోవాలని ఎఎంసి ఛైరపర్సన్ దండి అనంతకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఎఎంసి యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు దళారీల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలకు రైతులకు తమ పంట తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

ఇదిలా ఉండగా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటైతే బాగుంది కానీ విక్రయాల మరోచోట ఏర్పాటు చేయడం, పంట ఆఖరు దశలో ఏర్పాటు చేయడం తమకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరులోనే పత్తి పంట దిగుబడి ప్రారంభమైంది. అంటే రైతులు రెండు నెలల క్రితమే పత్తి ఏరివేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. కానీ ఇంతవరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో రైతులు చాలా వరకు పత్తిని ప్రయివేటు వ్యాపారులకు అమ్మేశారు. ఈ ప్రాంతంలో పండించిన పంటలో దాదాపు 70శాతం ప్రయివేటు వ్యాపారులకు అమ్మకమైంది. నవంబరు వరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు గత్యంతరం లేక విక్రయించారు. కొనుగోలు కేంద్రం ఇక్కడ ప్రారంభించినా సరుకు కొనుగోలు మాత్రం రామభద్రపురం మండలం బూశాయివలసలోని జిన్నింగ్ మిల్లులోనే చేపడతారు. ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ ఆర్‌జెడి సుధాకర్ విలేకరులకు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర రూ.7020కే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కాటన్ కార్పొరేషన్‌కు సంబంధించిన కొనుగోలుదారు జిన్నింగ్ మిల్లులోనే వుంటారు. రైతులు నేరుగా అక్కడకే పత్తిని తరలించాల్సి వుంటుంది. ఉమ్మడి జిల్లాల నుంచి కూడా పత్తిని ఈ జిన్నింగ్ మిల్లు కే తరలించాల్సి వుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు జిన్నింగ్ మిల్లులకే పత్తి కొనుగోలు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని ఆర్‌జెడి సుధాకర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రైతులు భావిస్తున్నారు. సెప్టెంబరులో దిగుబడి అయిన పత్తిని రెండు నెలల పాటు ఇళ్లల్లో ఎలా దాచుకుంటామని రైతులు వాపోతున్నారు. 70శాతం మంది రైతులు ఇప్పటికే పత్తిని ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. సిసిఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు పత్తి రైతులను మభ్యపెట్టేలా ప్రకటనలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో ఆర్‌డిడి ఎర్రన్న, ఎఎంసి కార్యదర్శి భారతి, వైసిపి నాయకులు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్‌పర్సన్ అనంతకుమారి

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా బుధవారం ఏజెన్సీలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మండల కేంద్రంలో ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోడీ ఈ యాత్రను భగవాన్ బిర్సా ముండా జన్మ స్థలమైన జార్ఖండ్‌లోని ఖుంటి నుంచి ప్రారంభించగా, వీడియో కాన్ఫరెన్స్‌లో దేశ వ్యాప్తంగా ప్రసారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ప్రత్యేక అధికారి శోబిత్ గుప్త, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే లక్ష్యంగా యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన 'సమాచారం, విజ్ఞానం, వ్యక్తీకరించడం' ప్రాతిపదికగా ప్రచార వాహనం ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా పారిశుధ్య సౌకర్యాలు, అవసరమైన ఆర్థిక సేవలు, విద్యుత్ కనెక్షన్లు, గ్యాస్ సిలిండర్ల సదుపాయం, పేదలకు గృహాలు, ఆహార భద్రత, సరైన పోషకాహారం వంటి సంక్షేమ పథకాలను కేంద్రప్రభుత్వం అందించిందన్నారు. వన్ ధన్ వికాస్ కేంద్రానికి రూ.25 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. జిల్లాలో గిరి పుత్ర బ్రాండ్ కింద అటవీ ఉత్పత్తులను మార్కెటింగు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి ఇంకా నమోదు కాకపోతే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో వెంటనే నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రచార రథం రోజుకు రెండు పంచాయతీల్లో పర్యటించి అవగాహన కల్పిస్తుందని చెప్పారు. ప్రత్యేక అధికారి శోబిత్ గుప్త మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించేందుకు ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. నాబార్డు డిడిఎం నాగార్జున, లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, కృషి విజ్ఞాన్ కేంద్రం అధికారులు సంబంధిత సంక్షేమ పథకాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై కప్రక దీప, వన్ దన్ వికాస్ కేంద్రం (విడివికె) గురించి టి.శ్రీహరి మాట్లాడారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార వాహనాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్, భారత ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి శోబిత్ గుప్త జెండా ఊపి ప్రారంభించారు. ఉజ్వల లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్ మంజూరు పత్రాలు, వివిధ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఆర్‌డిఒ ఎం.లావణ్య, జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకర రావు, డిఇఒ ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె.శ్రీనివాస రావు, డిఎస్ఒ శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, సంకల్పయాత్ర ప్రత్యేకాధికారి తదితరులు

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవింగరావు

2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

డిసెంబరు 2,3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకొనేలా తెలియజేయాలని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 7,70,525 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఏప్రిల్ 15 నుంచి ఇప్పటివరకు 18504 మందిని ఓటరు జాబితాలో చేర్చడం, 21431 తొలగింపులు చేయగా, 74,799 సవరణలు చేశామన్నారు. క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తామన్నారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని, జనవరి 5న తుది జాబితా ప్రచురణకు సిద్ధమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాలు వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. 37 బియులు, 17 సియులు, 49 వివిపాట్లను సాంకేతిక లోపాలు గుర్తించిన కారణంగా బిఇఎల్ బెంగుళూరుకు పంపుతున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కర్నీ ఓటరుగా చేర్చాలని, చనిపోయిన, శాశ్వతంగా వలసపోయిన, పెళ్లయిన, అనర్హుల పేర్లను తొలగింపులను ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలుచోట్ల బిర్సాముండా జయంతి

ర్యాలీని ప్రారంభించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆదివాసీల స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి బస్టాండు నుండి ఐటిడిఎ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ బిర్సాముండా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం పురపాలక చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన ఐటిడిఎ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు, గిరిజన నాయకులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా, మల్లుదొర, గంటందొర, బోనంగి పండుపడాల్, కుడుముల బయ్యన్న, హనుమంతప్ప, దిప్పల సూరన్నదొర చిత్రపటాలకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ దేశస్వాంతంత్ర్యం కోసం ఎందరో ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని సమాజసేవకు ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. గిరిజన నాయకులు ఆరిక విప్లవకుమార్, సీతారాం మాట్లాడుతూ బిర్సాముండా అతి చిన్నవయసులోనే బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ పి.మురళీధర్, వెలుగు ఎపిడి సత్యంనాయుడు, ఐటిడిఎ ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజన సంఘ నాయకులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

కురుపాం : బిర్సా ముండా 149వ జయంతి వేడుకను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా భారతీయ ఆదిమ జాతుల స్వాతంత్ర్య పోరాట యోధుడని తెలిపారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.మాణికేశ్వరరావు, వి.సింహాచలం, పి.పత్తి, టి.తోంటయ్య, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : బిర్సా ముండా జయంతోత్సవాలు స్థానిక సారథి ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షులు రొబ్బా లోవరాజు మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు, యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇంటి కుప్పల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, గుజ్జివాయి సర్పంచ్ హిమారిక నాగేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పండగపూట జగనన్నకు చెబుదాం

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 17న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యాన జగనన్నకు చెపుదాం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జగనన్నకు చెపుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఆరోజు నాగుల చవితి పండుగ కావడంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు ఎలా హాజరవుతారని ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఇంతటి ముఖ్యమైన కార్యక్రమాన్ని పండుగ రోజున నిర్వహించాలని నిర్ణయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీపావళి పండుగ అయిన నాలుగు రోజుల తర్వాత నాగుల చవితి పండుగ నిర్వహిస్తారు. మండలంలోని గ్రామీణ, పట్టణ ప్రజలంతా నాగుల చవితి పండుగను ఆడంబరంగా జరుపుకుంటారు. జిల్లా కలెక్టర్‌కు ఈ పండుగపై అవగాహన లేకపోతే మిగిలిన జిల్లా స్థాయి అధికారులైనా ఆయనకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందంటున్నారు. అదేరోజున జగనన్నకు చెపుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తే ప్రజల నుంచి వినతులు పెద్దగా వచ్చే అవకాశం లేదు. పండుగ రోజు ఇలాంటి ముఖ్యమైన కార్యక్రమాన్ని నిర్వహించడంపై మండలస్థాయి అధికారులు కూడా లోలోన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో రోజు జగనన్నకు చెపుదాం కార్యక్రమం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

లిప్ శిక్షణను వాయిదా వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 17,18 తేదీల్లో జరిగే లిప్ శిక్షణను 18, 19 తేదీలకు వాయిదా వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు కోరారు. ఈనెల 17న నాగుల చవితి పండగ రోజున శిక్షణ పెట్టడం సరికాదన్నారు. నాగుల చవితి రోజున అన్ని పాఠశాలలకు లోకల్ హాలీడే ఇస్తున్నారని, ఈ పండుగ రోజున ట్రైనింగ్ ఇవ్వరాదని డిఇఒను కోరారు. అలాగే రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ అధికారులకు కూడా యుటిఎఫ్ పక్షాన కోరుతున్నామన్నారు. ఈ శిక్షణ పాలకొండ డివిజన్ పాఠశాలలకు పాలకొండలో పార్వతీపురం డివిజన్ వారికి పార్వతీపురంలో హైస్కూల్ హెచ్ఎంలకు, ఎంఇఒలకు ఇస్తున్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

గర్భిణుల వసతి గృహంలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గర్భిణుల వసతి గృహాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహార పదార్థాలు, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల హెమోగ్లోబిన్ స్థాయిలు పరిశీలించారు. పౌష్టికాహారం కిట్ల వినియోగం తనిఖీ చేశారు. నాలుగు, ఐదవ కాన్పుల కోసం ఉన్నవారితో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నప్పుడు వారికి సరైన పోషణ కష్టమవుతుందని దాన్ని ఆలోచించాలని సూచించారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది ఉండటం వల్ల వారి ఆరోగ్యం, విద్య, పెంపకం పట్ల ఆర్థిక భారంతో ఉన్న కుటుంబాలకు మరింత భారం కావచ్చని ఆయన చెప్పారు. కావున కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అలాగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలని కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించే గ్రామ పంచాయితీలలో వైద్య శిబిరాలు విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాలలో ఓపి కనీసం 50 ఉండాలని, సికిల్ సెల్ ఎనీమియా సందేహస్పదంగా ఉన్న వారిని పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. జెఎస్‌వై, పిఎంవై పథకాలు కింద రెండో కాన్పులో బాలిక జన్మిస్తే ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, వాటిని వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, నోడల్ అధికారులు ఎం.వినోద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. బుధవారం పిఆర్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లుల అప్లోడింగ్ కూడా త్వరితగతిన చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు త్వరితగతిన చెల్లింపులు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు భవనాలను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇఇ రవికుమార్, డిఇలు రాధారాణి, లోకనాథం, ఎఇ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు మామిడి సింహాద్రినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పలు రైతు సమస్యలపై తహశీల్దారుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే జరపాలని, తప్పులను సవరించాలని వారు కోరారు. సర్వే జరిగిన ప్రాంతాల్లో ఇంతవరకు 1-బిలు ఇవ్వకపోవడంతో రుణాలు పొందాల్సిన రైతులకు బ్యాంకు వారు రుణాల అందించడంలోనూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు 1బి సకాలంలో ఇవ్వకపోవడంతో పాత రుణాలు రెన్యువల్ చేసుకోవడంలో గానీ కొత్త రుణాలు పొందడానికి గానీ అవకాశం లేదని బ్యాంక్ అధికారులు తేల్చి చెప్తున్నారని, ఈ విషయంలో తహశీల్దారు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అధికారులు స్పందించి రైతు సమస్యలను తీర్చాలని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు నివారించాలని, అక్రమ మద్యం, ఇసుకపై నిఘా పెంచాలన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, ఎస్సై కె.నీలకంఠం, సిబ్బంది పాల్గొన్నారు.

3న వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

డిసెంబర్ 3న వికలాంగుల దినోత్సవం జిల్లా స్థాయిలో అన్ని మండలాల్లోని వికలాంగుల సంఘాలను కలుపుకొని ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని దివ్యాంగుల పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో గల వికలాంగులకు అన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో క్రీడ, సాంస్కృతిక పోటీలను నిర్వహించగలరని, సదరు పోటీల్లో విజేతలకు ప్రపంచ వికలాంగ దినోత్సవం నాడు బహుమతి ప్రధానాలను చేయాలని కోరారు. అలికో కంపెనీ వారి దివ్యాంగ పరికరాల గుర్తింపు క్యాంపులను ఈ నియోజకవర్గంలో జరిగేలా చేయగలరని ఎమ్మెల్యేను కోరగా వారు అంగీకరించారని తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పిట్ట గంగులు, శంబంగి భాస్కరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎఎంసి నూతన సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

లింక్ రోడ్లకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు కలుపుతూ రైతుల సౌకర్యార్థం లింక్ రోడ్ల ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సూచనలతో గత అభివృద్ధి పనుల ప్రతిపాదనలు రీ టెండర్లు పిలవటంతో పాటు లింక్ రోడ్ల నిర్మాణాలకు, కొత్త ప్రతిపాదనలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రెండు మండలాల నుండి కొత్తగా ముగ్గురు డైరెక్టర్లను నియామకం కాగా, పార్వతీపురం మండలం నుండి భూతల మంగమ్మ, సీతానగరం మండలం నుండి బుడితి పద్మావతి, బక్కు శ్రీదేవిని కార్యవర్గ సభ్యులు అంతా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎఎంసి చైర్పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, డైరెక్టర్లు, ఎఎంసి సెక్రెటరీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎంసి సభ్యులుగా పద్మావతి, శ్రీదేవి

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం వ్యవసాయ మార్కెటింగ్ పాలకమండలి సభ్యులుగా మండలంలోని కామన్నదొరవలసకు చెందిన బుడితి పద్మావతి, బక్కుపేటకు బక్కు శ్రీదేవును కొత్తగా ఎన్నికయ్యారు. ఈ మేరకు వీరు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములునాయుడు, జెడ్పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, గ్రామ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బి.గౌరినాయుడు, బుడితి ముకుంద, నాయకులు అప్పలనాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు

వీధి దీపాల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వీధి దీపాల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమేమిటని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో రెండు రోజులుగా నిరంతరం విద్యుత్ దీపాలు వెలిగి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయడంలేదన్నారు. దీని నిర్వహణ బాధ్యతలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో వారి నిర్లక్ష్యం వల్ల నిరంతరం విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మున్సిపాలిటీకి అదనపు విద్యుత్ ఛార్జీల భారం పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రైవేట్ సంస్థకు సంబంధించిన సూపర్వైజర్, సిబ్బంది పర్యవేక్షణ చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ విషయంపై ఇంజనీరింగ్ విభాగం ఎఇ సన్యాసిరావుకు వివరణ అడగ్గా పలు వార్డుల్లో కొందరు ఎంసిబిలను వేయడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుందని, సమస్య పునరావృతం కాకుండా పర్యవేక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని పెద్దూరులో కొత్తగా సుమారు రూ.80లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామ సచివాయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుమిత్ర, ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్రావు, సర్పంచులు హిమరక ఆదిలక్ష్మి, నిమ్మక విజయ కుమారి, బిడ్డిక తిరుపతిరావు, నిమ్మక తిరుపతిరావు, సవర కుర్మారావు, సవర గణేష్,పలువురు ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్డి కె.సత్యం, మండల అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. 26వ వార్డు వెంకటేశ్వరా కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.3లక్షలతో నిర్మించిన ఫైలట్ వాటర్ స్కీంను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించడానికే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు పి.సన్యాసమ్మ, గొర్లి వెంకటరమణ, పి.లక్ష్మణరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి,మేకల శంకరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు బిజెపి చేసింది శూన్యం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు చేసింది శూన్యమని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలల్లో తాత్కాలికంగా భర్తీ చేసిన ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల్లో రిజర్వేషన్లు పాటించలేదని గుర్తు చేశారు. మరో వైపు గిరిజనులను అడవికి దూరం చేసేందుకు అటవీ సంరక్షణ చట్టం పేరుతో కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. జీవో 3 పునరుద్ధరణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రతీ విషయంలోనూబీజేపీ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో గిరిజనుల ఓట్లు కోసమే బిర్సా ముండా జయంతి పేరుతో మభ్యపెట్టే కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలకొసారి జరపాల్సి ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు జిల్లా అధికారులు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు.

షాపుల అద్దె చెల్లించాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్లో ఉన్న షాపులకు సంబంధించిన అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ చైర్పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ కోరారు. బుధవారం ఆమె తన ఛాంబర్లో ఐడిఎస్ఎంటి షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. షాపుల్లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. బకాయిలు పేరుకుపోతే వ్యాపారులకు భారమవుతుందని చెప్పారు. సమావేశంలో కమిషనర్ టి.జయరాం, ఆర్వో రాఘవాచార్యులు ఆర్ఐ అహ్మద్ పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉల్లాసం

ప్రజాశక్తి - వీరఘట్టం

క్రీడలతోనే ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటుందని సర్పంచ్ మిడతాన కల్యాణి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలం వండవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. వంట ఏజెన్సీలకు పాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, పిఇటి పోలిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వీరఘట్టం

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం-4 పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు వివరించారు. ఇందుకు సంబంధించి వివిధ రకాల పథకాలు రూ.17,34,28,000 ఖర్చు చేసినట్లు నివేదిక ప్రజల ముందు ఉంచారు. కార్యక్రమంలో సర్పంచు పి.గౌరమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి కె.ప్రేమభూషణరావు, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఎంపిటిసిలు మంతెన హేమలత, బండి నిరోషా, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - సాలూరు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. ఈనెల 14నుంచి ప్రారంభమైన 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆమె పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరైన విద్యార్థులు, పాఠకులతో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. విద్యార్థులు, యువకులకు ఉపయోగపడేలా దినపత్రికలు, పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు మేలు చేసే పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయ అధికారిణి రాధాదేవి పాల్గొన్నారు.

పాలకొండ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. స్థానిక పెదవీధి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావుతో పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల పిల్లలో ఎక్కువ జ్ఞాపక శక్తి, విజ్ఞానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.తిరుపతిరావు, దుర్గారావు, గడ్డెయ్య, గ్రంథాలయ అధికారి బి.గణేష్బాబు, సహాయకుడు ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ కాలేజీ అధ్యాపకులు ఉదయకుమార్, ప్రవీణ్ పాల్గొని పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఉదయభాస్కర్, కాలేజ్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్రావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి తమ మేధస్సు పెంచుకోవాలని గ్రంథాలయ నిర్వహకురాలు డి.సుకన్య కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోటీ పరీక్షలకు, నవలు, పిల్లల పుస్తకాలు, పురాణ గ్రంథాలు వంటివి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

పాలకొండ : గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి

సాలూరు : గ్రంథాలయ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న చైర్పర్సన్ రెడ్డి పద్మావతి

పార్వతీపురంరూరల్ : మండలంలోని ఎంఆర్నగరం జెడ్పి హైస్కూలులో జిల్లా గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉత్సవాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డి. విజయకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సంపదను సమకూర్చుతాయని, విద్యార్థులు పఠనాశక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షులు టి.శివకేశవరావు, పి.డి. కె.తిరుపతిరావు, ఉపాధ్యాయులు కె.సుశీల, పిడి ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠనం వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. స్థానికప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమసుందర్తో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో శివకుమార్, స్కూల్ అసిస్టెంట్, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఇఒ,పాఠశాల ప్రత్యేకాధికారి,

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గాజులవలస జిల్లా పరిషత్ పాఠశాలను ఎంఇఒ జి.సూర్యదేవుడు, పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్.అవినాష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారి ఉత్తీర్ణతకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలని అన్నారు. వారం వారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే పరీక్షల పట్ల పోటీతత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

టిడిపితోనే అభివృద్ధి : తోయక

ప్రజాశక్తి - కొమరాడ

రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని విక్రంపురంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేస్తున్న మినీ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు జరిగిన మోసం, అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న వంతెనతో పాటు జంఝావతి, వనకాబడి ప్రాజెక్టుల సమస్యలు తరతరాలుగా ఉన్నాయన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వీటి పూర్తికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ శేఖర్ పాత్రుడు, నాయకులు సుదర్శనరావు, మధుసూదనరావు, తదితరులు ఉన్నారు.

సాలూరురూరల్: మండలంలోని ఖరాసువలస, గుర్రప్పవలస, కొమ్మన్నవలస, దట్టివలస గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి గుమ్మడి సంధ్యారాణి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించబోయే పథకాలు గురించి కరపత్రాల ద్వారా ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణ, యుగంధర్, ఎంపిటిసి సభ్యులు రమాదేవి, శ్రీను పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో దబరలో పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకష్ణ మినీ మేనిఫేస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరిస్తూ ఖచ్చితంగా చంద్రబాబు మళ్లీ సిఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమం సవర రవి, సవర సంజయ్, సవర శంకర్, సాయి, సవర బాలరాజు, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కొమరాడ : విక్రమపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

విద్యుత్, ఆర్టిసి శాఖలపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతిసారి నిర్వహిస్తున్న సర్వసభ్య సమావేశాలకు ఉన్నత అధికారులు హాజరు కావాల్సి ఉండగా కింది స్థాయి సిబ్బందిని పంపించి సమావేశాలకు దుమ్మా కొట్టడం ఎంతవరకు సమంజసమని ఎంపిపి కె. దీనమయ్య ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి దీనమయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చిన విద్యుత్తు, ఆర్టీసీ శాఖల పనితీరు సరిగ్గా లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి జోక్యం చేసుకొని ఆర్టీసీ సేవలు ఏజెన్సీలో నామమాత్రంగానే ఉన్నాయన్నారు. గతంలో లప్పటి, పి.ఆమిటి గ్రామాలకు బస్సులు నడిపే వారని, ప్రస్తుతం సర్వీసు లేదని కారణంతో రద్దు చేయడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇదే సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం స్పందించలేదని మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి డిఎం స్థాయి అధికారి రావాల్సి ఉండగా కింది స్థాయి సిబ్బందిని పంపిస్తే సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యాన్ మరమ్మతులకు గురికావడంతో మూడు, నాలుగు నెలలుగా రావడం లేదని ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు తెలిపారు. ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న డుమ్మంగి పంచాయతీ కేంద్రానికి వచ్చి బయోమెట్రిక్ వేసి నిత్యవసర సరుకులు తీసుకెళ్లాల్సి వస్తుందని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు, తాగునీరు తదితర శాఖలపై సమీక్ష జరిగింది. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, ఎం.లక్ష్మణరావు, జడ్పిటిసి ఎం.రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన, టిడిపి నాయకులు

వైసిపి ఓటమికి కృషి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల గెలుపునకు కృషి చేయాలని, వైసిపి ఓటమికి నడుంకట్టాలని జనసేన పార్టీ కో ఆర్డినేటర్ లోకం మాధవి కోరారు. పార్వతీపురం నియోజక వర్గంలోని టిడిపి- జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ రెండు పార్టీలు కలిసి పోరాటం చేసి ప్రజాస్వామ్యానికి కూనీచేసిన వైసిపిని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి జగదీష్, నియోజకవర్గ ఇన్ఛార్జి బోనెల విజయ్ చంద్ర, జనసేన సమన్వయకర్త ఎ.మోహనరావు, పార్వతీపురం,సీతానగరం మండల టీడీపీ నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, బోను దేవీచంద్రమౌళి, జి.చంద్రమౌళి, కొల్లి తిరుపతిరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని కొత్తవలసలో ఆంధ్రప్రదేశ్కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం నిర్వమించారు. ఈసందర్భంగా రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్ ప్లె బోర్డ్ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడమే ధ్యేయంగా ప్రభుత్వం విప్లవాత్మక పాలన సాగిస్తున్నదని, రాష్ట్రానికి ఇలాంటి సంక్షేమ ప్రభుత్వం మరలా ఎందుకు అవసరమో ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సువ్వాడ రామ కష్ణ, అధికారి పెంటంనాయుడు, కొత్తవలస సర్పంచ్ కల్యాణ్, సీతారాం, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అధ్యక్షుడి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గ సమస్యలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడికి దృష్టికి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు బిడ్డిక దమయంతినాయుడు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర మాలయ్య, ఆరిక లక్ష్మయ్య, మాజీ జడ్పీటీసీ పాలక రాజబాబు, టిడిపి నాయకులు హిమరక ప్రసాద్, మాజీ సర్పంచ్ సవర సూర్యారావు, తదితరులు ఉన్నారు.

నర్సిపురంలో మైక్రో ఫైలేరియా సర్వే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురంలో మంగళవారం రాత్రి జిల్లా మలేరియా అధికారి ఎన్ఎంకె తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో మైక్రోఫైలేరియా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో భాగంగా గ్రామ ప్రజలకు రక్త నమూనాలు తీసి జిల్లాకు పంపించి అందులో ఫైలేరియా ప్రభావిత రోగులను గుర్తించి వారికి తగిన చికిత్స, మందులు అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు పెరుగుదల ఉండదని, తద్వారా దోమల వల్ల వచ్చే మలేరియా, ఫైలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఇది వరకు ఉన్న ఫైలేరియా రోగులకు ముదిరి పోకుండా సరైన మందులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సభ్ యూనిట్ అదికారి ధనుంజయ, లోకనాదం, రాజేంద్ర, జయగౌడ్, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

బిర్సా ముండా జయంతిని పురస్కరించుకునే కురుపాంలో గిరిజన సంఘం నాయకులు ఎ.చంద్రశేఖర్, ఐ.రామకృష్ణ, లోవరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి బి.జగన్నాథరావు చేతుల మీదుగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని అడ్డాపుశీల పంచాయతీలోని నిర్వాసిత గ్రామమైన కోటవానివలస గ్రామస్తులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవ తీసుకొని పరిష్కరించడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రోడ్డుకు అవసరమైన స్థల సేకరణ చేసేందుకు సంబంధిత ప్రైవేట్ భూహక్కుదారులతో మాట్లాడగా వారు అంగీకరించడంతో సమస్య పరిష్కారమైంది. వెంటనే గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని భార్యా భర్తలకు గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం తోటపల్లి సమీపంలో పార్వతీపురం - కురుపాం రహదారిపై కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం మాదలింగికి చెందిన రాగాల కృష్ణమూర్తి, లక్ష్మీ దంపతులు తమ ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వస్తుండగా వెనుక నుండి కారు బలంగా ఢీకొనడంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

కెఎస్ పురంలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కోటసీతారాంపురంలో బుధవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇ ఎస్.అవినాష్ మాట్లాడుతూ యూనిట్ 324 ప్లాట్లో 5 విస్తీర్ణంలో ప్రయోగం చేయగా 2.30 కిలోలు దిగుబడి వచ్చిందన్నారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో దిగుబడి తగ్గిందన్నారు. మొత్తంగా చూసుకుంటే ఈ ఖరీఫ్ సీజన్లో దిగుబడి తగ్గిందని తెలిపారు.

సకాలంలో టీకాలు వేయాలి : డిఐఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

అర్హులైన బాలింతలకు, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఖడ్గవలస, నాగూరులో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకా అర్హులైన పిల్లలు, గర్భిణుల నమోదు వివరాలను రికార్డులో పరిశీలించారు. వ్యాక్సిన్ స్థితి, అత్యవసర మందులు, హబ్ కట్టర్ పనితీరు తనిఖీ చేశారు. కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్ లో ఏ మేరకు టీకా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో వాటి ఆన్లైన్ చేసిన విధానాన్ని పరిశీలించారు. ఈ యూవిన్ పద్ధతిలో సులభంగా టీకా నిర్వహణ వీలవుతుందని, అర్హులైన పిల్లలందరికీ సకాలంలో టీకా వేయబడినదా, ఎవరైనా డ్రాప్ ఔట్స్ ఉన్నారా త్వరగా గుర్తించ వచ్చని అన్నారు. పిల్లల టీకా వివరాలతో కూడిన ధ్రువపత్రాన్ని (సర్టిఫికేట్) వారికి ఈ విధానంలో అందజేయవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందర్నీ యూవిన్లో రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది యశోద, సోములమ్మ, కుసుమ, దుర్గాభవాని, అంగన్వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని జగన్నాథపురం పట్టణ ఆరోగ్య కేంద్రం, రెండో వార్డులో టీకా కార్యక్రమాన్ని టి.జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకా, అర్హులైన పిల్లలు, గర్భిణుల నమోదు వివరాలను రికార్డులను, వ్యాక్సిన్ స్థితి, అత్యవసర మందులు, హబ్ కట్టర్ పనితీరు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ద్రాక్షాయన్, ఎఎస్ఒ వీరబాబు, సూపర్వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం నాగమణి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికా బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - కురుపాం

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ప్రణాళికా బద్దంగా చదవాలని ఐటిడిఎ ఎటిడబ్ల్యుఒ(?) బి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను విద్యార్థుల విద్యా ప్రమాణాలు, నోటు పుస్తకాలు పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సులభంగా అధికమార్కుల సాధించి ఉత్తీర్ణత పొందడానికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం మెనూ రికార్డులనుపరిశీలించారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, గిరిజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
I.A.288/2021 IN A.S /2018

Between: **Sahukare ashok Chandra (Died) and others** ...Petitioner/Appellant
And: **Sanapathi Rupadevi and others** ...Respondent/Defendant

To
Respondent No.9:- Nalla Khusbu, W/o Naveen Kumar, Hindu, aged about 356 years, Household duties R/o Belagam village, Parvathipuram Mandal, Manyam district. Currently residing Palakonda village and mandal, Srikakualm District
Respondent No.10:- Nemilapuri Swathi, W/o Ramakrishna, Hindu, aged about 356 years, Household duties. R/o Belagam village, Parvathipuram Mandal, Manyam district. Currently residing at Palakonda village and mandal, Srikakualm District

NOTICE

Please take this notice that the above matter is posted to **06-12-2023** for your appearance. You are hereby directed to appear before the Hon'ble court **at 10-30 A.M** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.
By court order

P.V.RAMANA DAYAL
ADVOCATE FOR PLAINTIFF,
ILLISIPURAM, SRIKAKULAM.